## రెండవ పాఠం | الدرس الثاني

### వస్త్రధారణ ధర్మములు | سنن وآداب اللباس

1- ముస్లిం పాటించవలసిన ధర్మాల్లో ఒకటి, కొత్త బట్టలు ధరించేటప్పుడు ఈ దుఆ చదవడం. అబూ సఈద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొత్త బట్టలు ధరించేటప్పుడు చొక్కా, తలపాగ మరేదైనా దాని పేరు చెప్పి ఈ దుఆ చదివేవారుః **అల్లాహుమ్మ లకల్ హందు అంత కసౌతనీహి అస్అలుక మిన్ ఖైరిహీ వ ఖైరి మా సునిఅ లహూ వఅఊజు బిక మిన్ షర్రిహీ వషర్రి మా సునిఅ లహూ.** (భావం: ఓ అల్లాహ్! నీకే సర్వ స్తోత్రములు, నీవే నాకు ఈ బట్టలు ధరింపజేశావు. దీనిలోని మేలును మరియు దేని కొరకు అది నేయబడిందో దాని మేలును నీతో కోరుతున్నాను. దాని కీడు నుండి మరియు దేని కొరకు అది నేయబడిందో దాని కీడు నుండి నీ శరణు జొచ్చుచున్నాను). (అబూ దావూద్ 4020, తిర్మిజి 1767). [అయితే రోజువారి బట్టలు ధరించేటప్పుడు "అల్ హందు లిల్లాహిల్లజీ కసానీ హాజస్ సౌబ వరజఖనీహి మిన్ ఘైరి హౌలిమ్ మిన్నీ వలా ఖువ్వహ్" చదివే వారి పూర్వపు పాపాలన్నీ మన్నించబడతాయి. (అబూ దావూదు 4023)].

2- బట్టలు తొడుక్కునేటప్పుడు కుడి వైపు నుండి తొడగడం ధర్మం. ఆయిషా రజియల్లాహు అన్హా చెప్పారుః "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాధ్యమైనంత వరకు మంచి కార్యాలు కుడి వైపు నుండి చేయడం మరియు మొదలు పెట్టటం ఇష్టపడేవారు. అది వుజూలోనైనా, తల దూసుకునేటప్పుడైనా మరియు చెప్పులు తొడిగేటప్పుడైనా". (బుఖారి 426, ముస్లిం 268).

చెప్పులు తొడిగేటప్పుడు ముందు కుడి కాలులో తొడగాలి, తీసేటప్పుడు ముందు ఎడమ కాలి నుండి తీయాలి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఆదేశించారని, అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "మీలో ఎవరయినా చెప్పులు తొడిగేటప్పుడు కుడి కాలు నుండి తొడగాలి. తీసేటప్పుడు ఎడమ కాలు నుండి తీయాలి. తొడిగితే రెండూ తొడగాలి. తీస్తే రెండూ తీయాలి". (ముస్లిం 2097, బుఖారి 5856). మరొక హదీసులో ఒక చెప్పు తొడిగి నడవడం నుండి నివారించబడింది. (బుఖారి 5855).

3- ప్రతీ ముస్లిం తన శరీరాన్ని, దుస్తులను పరిశుభ్రంగా, అశుద్ధతకు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. పరిశుభ్రత ప్రతి అలంకారానికి, అందానికి మూలం లాంటిది. ఇస్లాం పరిశుభ్రత గురించి ప్రోత్సహించడంతో పాటు శరీర, దుస్తుల శుభ్రతపై శ్రద్ధ చూపాలని కూడా చాలా ప్రోత్సహించింది.

4- తెల్లని బట్టలు ధరించడం మంచిది. ఇబ్ను అబ్బాస్ రజియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన హదీసులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః "మీరు తెల్లని దుస్తులు ధరించండి. మీ దుస్తులలోకెల్లా అతిఉత్తమమైనవి ఇవే. మీ మృతులకు కూడా ఈ తెల్లని వస్త్రాలతోనే కఫన్ ఏర్పాటు చేయండి". (అబూ దావూద్ 3878, తిర్మిజి 994). **వేరే రంగులు యోగ్యమే.**

5- దుస్తులు ఇతర అలంకరణ వస్తువుల ఖరీదులో దుబార ఖర్చులు చేయకుండా, మరీ పిసినారితనం వహించకుండా మధ్యేమార్గాన్ని అవలంబించాలి. అల్లాహ్ విశ్వాసుల గురించి ఇలా తెలిపాడుః ﴾**వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చు చేయరు. ఇటు పిసినారితనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతిచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది**﴿. (ఫుర్ఖాన్ 25: 67). ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః "తినండి, త్రాగండి, ధరించండి మరియు దానధర్మాలు చేయండి. అయితే దుబారా ఖర్చులు చేయకండి. అహంకారానికి గురికాకండి". (బుఖారి/ కితాబుల్లిబాస్).